క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో మంత్రి సంధ్యారాణి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి సంధ్యారాణికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఈవో కె.ఎస్.రామరావు, డీఈవో రత్నరాజులు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీ నిర్మాత అశోక్‌కుమార్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు.

బార్లు, మద్యం దుకాణాలతో కూటమి ప్రభుత్వం సంపద సృష్టి

– వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బార్లు, మద్యం దుకాణాలకు విచ్చలవిడిగా అనుమతులిచ్చి సంపద సృష్టిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ఆయన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సంపద సృష్టి మొదలైందన్నారు. నాయకులకు, క్యాడర్‌కు రాష్ట్ర సంపదను, ప్రజల ఆరోగ్యాన్ని పంచి పెట్టడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఈ సంపద సృష్టిలో భాగంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సితార సెంటర్ నుంచి గొల్లపూడి కమర్షియల్ కాంప్లెక్స్ పప్పుల బజార్ వరకు కిరాణా షాపులతో సమానంగా 12 మద్యం షాపులు, బార్లు వెలిశాయన్నారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి వారాని కోసారొచ్చి పోతుంటారు, కనుక ఈ నియోజకవర్గ ప్రజలు ఏమైపోయినా వారి జీవితాలు ఏమైపోయినా ఎవరూ పట్టించుకోరన్నారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరంలోనే ఉండాలన్న నిబంధన గాలికి ఎగిరిపోయిందని చెప్పారు. కొంతమంది చోటా, మోటా నాయకులు అవకాశం వచ్చింది అధికారం వచ్చింది నాలుగు రాళ్లు వెనకేసుకుందామని పార్టీలు మారుకుంటూ ప్రజలను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. మన మతమే, మన కులమే అనుకుంటే నాశనమయ్యేది ప్రజలేనని అందరూ గుర్తించాలని కోరారు.

మంచి నడవడికతోనే ఉన్నత శిఖరాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు క్రమశిక్షణ, మంచి నడవడికతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు ఆకాంక్షించారు. డ్రీమ్ టీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాధరపురం లేబర్‌కాలనీలోగల జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో చదువుకుంటున్న వరద ప్రభావిత ప్రాంతాలలోని విద్యార్థులకు బ్యాగ్, పుస్తకాలు, పెన్‌తోకూడిన కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి సమాజంపట్ల అవగాహన కలిగి ఉండాలని, చెడుకు దూరంగా ఉంటూ మంచిని ఆకళింపు చేసుకోవాలన్నారు. సామాజిక కార్యకర్త తిరుపతి అనూష, డ్రీమ్ టీమ్ సభ్యులు సుమంత్, అజయ్, జయప్రకాష్, మహేష్, పోతురాజు, ఒడుగు శ్రీకాంత్, మల్లాడి రాజేష్, శ్రీను, యశ్వంత్ పాల్గొన్నారు.

నాగ్‌పూర్ సభ పోస్టర్ ఆవిష్కరణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నాగ్‌పూర్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సభల పోస్టర్‌ను దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎంను బుధవారం విజయవాడలో పర్యటించిన సందర్భంగా ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ జోనల్ సెక్రటరీ గూటాల పాపారావు ఆధ్వర్యంలో నేతలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నాగ్‌పూర్‌లో జరిగే సభలకు వెళ్లే ఉద్యోగులకు ప్రత్యేక రైలు కేటాయించిన జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు ఈ సందర్భంగా పాపారావు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. జీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ డివిజన్ ప్రెసిడెంట్ కంటి రమేష్, నాయకులు శ్రీనివాసరావు, సీహెచ్ కాసి, మోజెష్, శ్రీనుబాబు తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తాపీ పని కోసమని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఊర్మిళానగర్‌కు చెందిన షేక్ ఖాసీంసాహెబ్ తాపీ పనులు చేస్తుంటాడు. చిన్న నాటి నుంచి మానసిక స్థితి బాగోలేదు. భార్య చనిపోవడంతో తన తల్లితో కలిసి జీవిస్తున్నాడు. కొద్ది రోజులుగా పనులు లేకపోవడంతో ..ఎవరి వద్ద అయినా పని దొరుకుతుందేమోనని ఈ నెల 18వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇక ఆ తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఖాసీం సాహెబ్ తల్లి భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదకర గుంతలతో బెంబేలు

- గుంతలమయంగా గొల్లపూడి బైపాస్ రహదారి
- ఆ మార్గంలో రాకపోకలకు జంకుతున్న వాహనదారులు
- తక్షణమే మరమ్మతులు చేయాలని వినతి



వాహనదారుల పాట్లు



గొల్లపూడి బైపాస్ రహదారి దుస్థితి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి మైలు రాయి సెంటర్ నుంచి విజయవాడ వైపు వచ్చే రహదారిలో ఉన్న భారీ గుంతలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఆ రహదారిలో మాత్రమే కాకుండా పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలో అడుగుకో గుంత కనబడుతుంది. గుంతల రహిత రోడ్లు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిత్యం చేస్తున్న సమీక్షలు అక్కడి వరకే పరిమితం అవుతున్నాయి తప్ప ఎక్కడా కార్యాచరణకు నోచుకోక పోవడంతో ప్రజలు 'గుంత'లకడి..'గుంత'లకడి..బాబూ... అంటూ ఎద్దేవా చేస్తూ పాట పాడుకుంటున్నారు. ప్రమాదకరంగా తయారైన రోడ్ల గుంతలను ఎప్పటికి పూడుస్తారు సారూ అంటూ ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ఆయా గుంతల మీదుగా ప్రయాణించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గొల్లపూడి బైపాస్ రహదారిలోగల భారీ గుంతలతో ఆ మార్గంలో ప్రయాణించాలంటే నరకం మరెక్కడో లేదని స్పష్టం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో బైపాస్ రోడ్‌లో విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక ఆందోళనకు గురి కావల్సి వస్తుందని వాపోతున్నారు. గత 6 నెలల నుంచి ఇదే పరిస్థితి నెలకొందని, పట్టించుకునే నాథుడే లేడని మండిపడుతున్నారు.

లక్ష్యం సరే.. పనులు ప్రారంభించేదెప్పుడూ ?

సంక్రాంతి పండుగ నాటికి గుంతల రహిత రహదారులు ఉండాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా ఉన్నప్పటికి అది ఏ సంక్రాంతి అనేది ఆయన స్పష్టం చేయక పోవడంతో అనుమానాలు కలుగుతున్నాయని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. గుంతలు పూడ్చటానికైనా టెండర్లు పిలవాలి..కాంట్రాక్టర్లు ముందుకు రావాలని, ఈ ప్రక్రియ ముగిసేదెప్పుడు, గుంతలను పూడ్చే పనులు మొదలు పెట్టేదెప్పుడు అంటూ ప్రజలు నిట్టూర్పులు విడుస్తున్నారు. గొల్లపూడి బైపాస్ రహదారి పరిస్థితి ఇలా ఉంటే భవానీపురం చర్చి సెంటర్, ఊర్మిళానగర్ పోలేరమ్మ గుడి వద్ద, కబేళా సెంటర్‌లో గుంతల సంగతి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గుంతలు పడిన ప్రదేశంలో వాహనాల రాకపోకలతో కంకర రాళ్లు రోడ్డుమీద పడటంతో వాటిపై ప్రయాణించే సమయంలో బైక్ స్కిడ్ అయ్యి ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదని, దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ద్విచక్ర వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే బైపాస్ రహదారిమీదుగా అట్కిన్‌సన్ స్కూల్‌కు వెళ్లే మలుపులో రోడ్డు దెబ్బతిని లారీ, టిప్పర్లు, భారీ వాహనాలు బోల్తా పడిన సంఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రోడ్ల నిర్మాణం సంగతి ఎలా ఉన్నా కనీసం గుంతలనైనా పూడిస్తే ప్రమాదాలను నివారించవచ్చని వ్యాఖ్యానిస్తున్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక కమిటీ సమావేశం



వీఎంసీలో చర్చిస్తున్న అధికారులు, కార్పొరేటర్లు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు పరిష్కారానికి, నూతన పైపులైన్ల ఏర్పాటు, పాతవి తొలగింపు, సంపులు, బోర్లు, మోటర్లు తదితర తాగునీటి సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై వీఎంసీ తాగునీటి సరఫరా, భూగర్భ నీటి పారుదల ప్రత్యేక కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో మొత్తం 15 అంశాలు ప్రతిపాదన రాగా అందులో 12 అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేయగా, మూడు అధికారుల రిమార్కులకు కమిటీ పంపింది.

రేపు స్థాయీసంఘం సమావేశం

విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలపై మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన స్థాయిసంఘం సమావేశం జరుగనుంది. ఇందులో ఆయా సమస్యలను చర్చించి పరిష్కారానికి సభ్యులు చర్యలు తీసుకోనున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న అమర్‌సుధీర్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రక్తదానం ప్రాణదానంతో సమానమని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని చిట్టా అమర్‌సుధీర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రక్తదానంతో మరో వ్యక్తి ప్రాణాన్ని కాపాడవచ్చన్నారు. విద్యార్థులు రక్తదానం చేయటానికి ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ఇతర విద్యార్థులను సైతం రక్తదానానికి ప్రోత్సహించాలని సూచించారు. ఎంబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎం.సాయి అత్యధికంగా రక్తదానం చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.శ్రీకాంత్ రెడ్డి నిర్వహించగా కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శరవణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి, డాక్టర్ సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక పరివర్తనతో సమాజానికి ఉపయోగపడాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ రామకృష్ణయ్య



బాలుర పరిశీలనా గృహంలో మాట్లాడుతున్న రామకృష్ణయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): బాలుర పరిశీలనా గృహంలోని పిల్లలు మానసిక పరివర్తన చెంది సమాజానికి, కుటుంబానికి ఉపయోగపడాలని ఉమ్మడి కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కేవీ రామకృష్ణయ్య అన్నారు. విద్యాధరపురం కబేళా రోడ్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం(జువెనైల్ హోమ్)లో బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆటలు పిల్లల మానసిక పరివర్తనకు, శారీరక ధృడత్వానికి దోహదపడతాయన్నారు. న్యాయవాదిని నియమించుకోలేని హోమ్‌లోని పిల్లలకు న్యాయవాదిని ఉచితంగా ఏర్పాటు చేయాలని హోమ్ పర్యవేక్షణాధికారికి సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హోమ్ పర్యవేక్షణాధికారి పి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ వారం రోజులపాటు హోమ్‌లోని బాలురకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మెడికల్ క్యాంప్‌లు నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, గ్లోబల్ చెస్ అకాడమీ అధ్యక్షుడు, కోచ్ షేక్ కాశీం, అడ్వకేట్స్ షేక్ నజీర్, బుద్ధరాజ్, మహాలక్ష్మి, హోమ్ ఇంటెక్ ప్రొహిబేషన్ అధికారి హసన్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో

బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల ముగింపు సందర్భంగా నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యాధరపురం కబేళా వద్దగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు 'మత్తు వదిలితేనే భవిష్యత్' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక, కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్ పాల్గొని మాట్లాడారు. వక్తృత్వ పోటీలో రిజ్వానా, ఆఫ్రా, ఆరిఫలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకోగా ఖాసింబీకి ప్రోత్సాహక బహుమతి అందించారు. నలుగురు విజేతలకు కాలేజీ ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్ షేక్ ఒక్కో విద్యార్థికి రూ.500ల చొప్పున రూ.2 వేలు నగదు అందజేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారిణులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి సన్నిధి కూచిపూడి డ్యాన్స్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై రాధిక శ్రీనివాస్ పర్యవేక్షణలో తన మయిశ్రీ, ప్రణతి, కృతి, తన్వి, ఉషా, అవంతిక, రితూ శ్రిద్ధ, అదితి, వేద మహి, యశశ్రీలతో పాటు మరి కొంత మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ఆలయం వెలుపలకు విచ్చేసిన భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. అనంతరం ఆలయ ఈవో కె.ఎస్.రామరావు, డెప్యూటీ ఈవో రత్నరాజులు చిన్నారులకు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు కేబీఎన్ విద్యార్థి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల విద్యార్థి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ – 19లో స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ – 19 ఇంటర్మీడియెట్ స్థాయి విద్యార్థుల స్విమ్మింగ్ పోటీలలో తమ విద్యార్థి పి.కిరణ్ రాష్ట్రస్థాయి అండర్ – 19 పోటీలలో 100 మీటర్ల ఫ్రీస్టైల్స్ స్విమ్మింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్‌లో త్వరలో జరుగనున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో అండర్ – 19 స్విమ్మింగ్ విభాగంలో కిరణ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అభినందించారు. కార్యక్రమంలో పీడీ హేమచంద్రరావు, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎఫ్‌సీఐ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

విజయవాడస్పోర్ట్స్: భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడ శివారు నున్నలోని గ్రీన్ ఫీల్డ్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌సీఐ ఏపీ రీజనల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్‌యాదవ్ తెలిపారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, తాడేపల్లిగూడెం, విజయవాడ, నెల్లూరు, కర్నూలు డివిజనల్ కార్యాలయాల జట్లు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. పోటీల్లో విజేత జట్లకు ట్రోఫీలను అందజేస్తామన్నారు.

నలుగురు ఏసీపీలకు పోస్టింగ్

విజయవాడస్పోర్ట్స్: డీఎస్పీల సాధారణ బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు నలుగురు ఏసీపీలను కేటాయిస్తూ డీజీపీ ద్వారకాతిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం క్రైం ఏసీపీగా సి.హెచ్.వెంకటేశ్వర్లు, సీటీసీ ఏసీపీగా బి.ఉమామహేశ్వరరెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీగా కె.లతాకుమారి, సీఎస్‌బీ ఏసీపీగా ఎస్.కిరణ్‌కుమార్‌ను నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న ఈ నలుగురికి పోస్టింగ్ ఇస్తున్నట్లు డీజీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని వస్తువులకు 25న వేలం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీఎస్‌బీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ మద్యం షాపులకు సంబంధించిన వస్తువులకు ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు గొల్లపూడి డిపో ఇన్‌చార్జి మేనేజర్ ఆర్.దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాలకు సంబంధించిన 80 ఫ్రీజర్స్, 84 బ్యాటరీ ఇన్వర్టర్స్, 93 క్యాష్ చెస్ట్, 335 స్కానర్లు, 92 క్యాష్ కౌంటింగ్ మెషీన్లకు వేలం జరుగుతుందన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో గొల్లపూడి డిపోలో వేలం నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 94411 93915 నంబరులో సంప్రదించాలని కోరారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం



గురువును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ధ్యానంతో మానసిక ప్రశాంతతను పొందవచ్చని ప్రముఖ పిరమిడ్ ధ్యాన గురువు ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సర్వీస్ స్పెక్ట్రమ్ క్లబ్ ఆధ్వర్యంలో 'శ్వాస మహా విజ్ఞానం' పేరుతో ధ్యాన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఒత్తిడిని తగ్గించుకోవటం ద్వారా విద్యార్థులు ఎన్నో విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు. దానికి ధ్యానం అండగా ఉంటుందన్నారు. దృష్టి కేంద్రీకరణకు ఉపయోగపడే పద్ధతులను వివరించారు. అలాగే నిత్యం కొంత సమయం ధ్యానానికి కేటాయించడం ద్వారా అనేక సత్ఫలితాలు పొందుతారన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కోవటానికి ధ్యానం చక్కని మార్గమన్నారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శరవణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి, డాక్టర్ సురేష్, అధ్యాపకులు డాక్టర్ షేక్ అక్బర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీడీపీ అరాచకాలను నియంత్రించాలి

- బాధ్యులను శిక్షించాలి..
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు



మాట్లాడుతున్న దేవినేని అవినాష్, పక్కన విష్ణు ఆసిఫ్, డెప్యూటీ మేయర్లు దుర్గ, శ్రీశైలజ

గుణదల(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో కీచక పాలన మొదలైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆరోపించారు. ఐటీడీపీ మీడియా కార్యకర్తలపై వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణుతో కలసి మాచవరం పోలీసులకు బుధవారం ఆయన ఫిర్యాదు చేశారు. మాచవరం ఎస్ఐ శంకరరావుకు ఫిర్యాదు ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేతలు ఐటీడీపీ మీడియాను అడ్డుపెట్టుకుని వైఎస్సార్ సీపీ నేతలపై దుష్ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం వైఎస్సార్ సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని వివరించారు. టీడీపీ నేతలు చేస్తున్న అరాచకాలను నియంత్రించాలని పోలీసులకు విన్నవించామని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యకర్తలకు అండగా ఉంటారని, బెదిరింపులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలకు తెర దింపి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. సోషల్ మీడియాను అడ్డు పెట్టుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న టీడీపీ నాయకులపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. నగర డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీ శైలజ, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్లు కలపాల అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆసిఫ్, నవీన్, సుభాషిణి, చంద్రలీల తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ డివిజన్‌లో రైల్వే జీఎం తనిఖీలు



గూడూరులో పర్యటిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ బుధవారం విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో కలిసి గూడూరు–నెల్లూరు–విజయవాడ స్టేషన్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ముందుగా గూడూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీని ప్రారంభించిన జీఎం స్టేషన్‌లో అందుబాటులో ఉన్న ప్రయాణికుల సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం స్టేషన్‌మాస్టర్ కార్యాలయం, స్టేషన్ పరిసర ప్రాంగణాన్ని పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లో నూతనంగా నిర్మాణం పూర్తిచేసుకున్న ఆర్పీఎఫ్ పోస్టును ప్రారంభించారు. పర్యావరణహిత కార్యక్రమంలో భాగంగా స్టేషన్‌లో మొక్క నాటారు. తదుపరి జీఎం గూడూరు–విజయవాడ సెక్షన్‌లో రియర్ విండో తనిఖీని చేపట్టి ట్రాక్‌లు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల నిర్వహణను పరిశీలించారు. అక్కడి నుంచి నెల్లూరు రైల్వే స్టేషన్‌ను సమగ్రంగా తనిఖీ చేసి స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం చీరాల రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన జీఎం ప్రయాణికుల సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ పర్యటలో పలు బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం... ఆధ్యాత్మిక వైభవం



పూజలు నిర్వహిస్తున్న విధుశేఖర భారతీస్వామీజీ

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠ ఉత్తరాధికారి శ్రీవిధుశేఖర భారతీ స్వామి నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న విజయయాత్ర బుధవారం ముగిసింది. స్వామి శివరామ కృష్ణ క్షేత్రంలో కొలువై వున్న బాల సుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామికి, సీతారామాలయం, సంతాన వేణుగోపాల స్వామికి, మహాలక్ష్మి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిలకు ప్రత్యేక పూజలు, శివాలయ శిఖరానికి కుంభాభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వేద పండితులు వేద సభను నిర్వహించారు. ఆధ్యాత్మిక గ్రంథ విక్రయశాల భారతీ గ్రంథ మండలిని స్వామి ప్రారంభించారు. అనంతరం స్వామి అనుగ్రహ భాషణచేస్తూ ధర్మబద్ధమైన జీవితం గడపాలని సూచించారు. ఆది శంకరులు స్థాపించిన శృంగేరీపీఠం వేద సంస్కృతికి కట్టుబడి ఉందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. విజయయాత్రలో భాగంగా స్వామి వారు నరసరావుపేట బయలు దేరారు. శివరామకృష్ణ క్షేత్ర ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ దంపతులు స్వామి వారికి వీడ్కోలు పలికారు.